క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మధిరరూరల్: మధిర పట్టణంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాలతో కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక



వెంకటనారాయణ

చింతకాని: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన నాగుబండి వెంకటనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా చల్లా కృష్ణారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘం బలోపేతానికి పాటుపడతానని తెలిపారు. అధ్యక్షునిగా తన ఎన్నికకు సహకరించిన ఆర్యవైశ్య సంఘం మండల నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా మోదీ పాలన



ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న బీజేపీ నేతలు, విద్యార్థులు

సత్తుపల్లి: భారతదేశం గర్వించేలా ప్రధాని మోదీ పాలన సాగుతోందని బీజేపీ జాతీయ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవి రమేష్ అన్నారు. గురువారం స్థానిక కళాభారతిలో.. యువ మోర్చా జిల్లా కార్యదర్శి నాగసురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నమో సమత సమ్మేళనాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయగా.. విద్యార్థులు, బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ మిశ్రా, పాలకొల్లు శ్రీనివాస్, రహ్మతుల్లా, సుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

వైరా: వైరా రింగ్‌రోడ్డులో ఏర్పడ్డ భారీ గుంతలకు అధికారులు మరమ్మతులు చేయాలని సీపీఎం కార్యదర్శి వర్గసభ్యుడు బొంతు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో గుంత పక్కనే పాడె ఉంచి వినూత్న నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలలైనా అధికారులు మరమ్మతులు చేయడం లేదని, దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తక్షణమే మరమ్మతులు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, పారుపల్లి కృష్ణారావు, శ్రీనివాసరావు, సుధాకర్, కృష్ణార్జునరావు, పాషా, సుగుణ, కృష్ణవేణి, రజిని పాల్గొన్నారు.

పరామర్శ

సత్తుపల్లి: మండలంలో ఎంపీ నామా నాగేశ్వరరావు గురువారం పలు కుటుంబాలను పరామర్శించారు. బుగ్గపాడు గ్రామంలోని బొడ్డు శివబాబును పరామర్శించారు. బుగ్గపాడు గ్రామంలో మొదటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అధిక్యత కొనసాగుతుందని, మీ గ్రామానికి అండగా ఉంటానన్నారు. ఆయన వెంట అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, దొడ్డా శంకర్‌రావు, వల్లభనేని పవన్, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వినుకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారుల కుటుంబాలకు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు నీటి గుంటలోపడి మృతి చెందిన కోలా మహేష్–నామగణి దంపతుల కుమారుడు సిద్దార్ద్, ఈసర శ్రీను, గంగాభవాని దంపతుల కుమారుడు వికాస్‌ల తల్లిదండ్రులను డీసీసీబీ మాజీ చైర్మన్, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయబాబు గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పాదిలి మారేశ్వరరావు, హెచ్ హరీష్, రాంబాబు, వెంకటేష్, కొప్పుల నాగేశ్వరరావు, శ్రీను, కొత్తపల్లి సురేష్, రాఘవ, కిన్నెర శ్రీను, ఎస్‌కె రెహమాన్, మువ్వా జగదీష్, ఈడుపుగంటి రామకృష్ణ, కొలపనేని సత్యం పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు

- ప్రభుత్వం మారినా.. ఆగని ఆక్రమణలు
- నిరుపేదలకు దక్కని సెంటు భూమి
- పట్టించుకోని అధికారులు



ముదిగొండలోని సర్వేనంబర్ 49,50 మధ్యలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ డొంక భూమి (ఇన్‌సెట్) గూగుల్ మ్యాప్‌లో డొంక ప్రభుత్వ భూమి చిత్రాన్ని విడుదల చేసిన రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూములు కనిపిస్తే మాటు వేసి మాయం చేస్తున్నారు. రూ.కోట్ల విలువ చేసే భూముల్లో బ్రోకర్లు ఆడిందే ఆటగా మారింది. అధికారులను సైతం లెక్కచేయక ధిక్కరించి దబ్బులు ఎదజల్లుతున్నారు. నిరుపేదలకు దక్కాల్సిన భూములు కబ్జా కోరల్లోకి వెళుతున్నాయి. జిల్లాలో కలెక్టర్ ఆదేశాలు పకడ్బందీగా ఉన్నా.. లెక్కచేయక ఎలాంటి అనుమతులు లేకపోయినా వెంచర్లలో అడ్డగోలుగా ప్రజలకు అంటగడుతున్నారు.

ముదిగొండ: మండలంలోని మూడు వెంచర్లు, ఆరు ప్లాట్లుగా అక్రమార్కుల చేతిలోకి మారుతున్నాయి. ముదిగొండలోని ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న 50, 49 సర్వే నంబర్ల మధ్యన ఉన్న రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమి సుమారు ఒక ఎకరంలో ఆక్రమణలకు గురైంది. ఆ రెండు సర్వే నంబర్లకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ డొంక దారి పాడవున రెండు వెంచర్ల మధ్యన ఉండడంతో అక్రమార్కులు పాట్లుగా చేసి విక్రయిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఈ తతంగం మొత్తం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలు ఆ ప్రభుత్వ డొంకలో గుడిసేలు వేసేందుకు సిద్దంగా ఉన్నారు. అధికారులు సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయించి ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలని ప్రజలు పలుమార్లు నెత్తి నోరు బాదుకున్నా, పట్టించుకున్న నాధుడే కరువయ్యారని వాపోతున్నారు.

ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు..

మండలంలోని సువర్ణాపురం, న్యూలక్ష్మీపురం, ఖానాపురం, పండ్రేగుపల్లి, ముదిగొండ రెవెన్యూ పరిధిలోని పదుల సంఖ్యలో విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు ప్రజలనుంచి ఆరోపణలున్నాయి. నూతన ప్రభుత్వం వచ్చినా అధికారుల తీరు మారడం లేదు. జిల్లాలో కూడా కలెక్టర్ ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతో అక్రమార్కులు రూ.కోట్లల్లో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

నిరుపేదలకు పంచాలి..

ఇటీవల ఆ రెండు సర్వే నంబర్లలో తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్వేయర్, ఆర్ఐ ఫీల్డ్ మీదకు వస్తే బెదిరింపులకు పాల్పడిన ఓ వ్యక్తి స్వయంగా నాదేనని చెప్పడం అందరి మధ్యన ఆశ్చర్యం కలిగించింది. సర్వే ఆపేయాలని దిక్కరించాడు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో సర్వే చేస్తున్నాం, మీకు సంబంధం లేదని అధికారులు చెప్పారు. అప్పటికే ఆ రెండు వెంచర్ల మధ్యన ప్రభుత్వ భూమిలో విక్రయాలు జరిగాయి. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ ప్రభుత్వ భూమిని సర్వే చేయించి నిరుపేదలకు పంచాలని ముదిగొండ ప్రజలు కోరుతున్నారు.

హద్దులు నిర్ణయిస్తాం..



ఈ సమస్య గతం నుంచి ఉన్నదని మా దృష్టికి వచ్చింది. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆదేశాలతో ఆక్రమణకు గురి కాకుండా హద్దులు నిర్ణయిస్తాం. చట్టరీత్య ఆక్రమణ చేపడితే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవు. ప్రభుత్వ ఆదేశాలు వస్తే అర్హులైన నిరుపేదలకు పంచడానికి అభ్యంతరం ఏమీ లేదు. పూర్తి సమగ్ర సర్వే చేపడతాం.

– రామారావు, తహసీల్దార్, ముదిగొండ

జాయింట్ సర్వే చేయిస్తాం



ఆర్డీఓ అశోక్‌చక్రవర్తితో మాట్లాడుతున్న మద్దిశెట్టి సామేలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రుద్రాక్షపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 360, 361, 43, 59లలో ఉన్న బుగ్గపాడు, చంద్రాయపాలెం, రుద్రాక్షపల్లి, గాంధీనగర్, అఖిపుర అటవీ, రెవెన్యూ భూములపై జాయింట్ సర్వే నిర్వహిస్తామని కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి హామీ ఇచ్చారు. గురువారం స్థానిక తహసీల్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ మద్దిశెట్టి సామేలు ఆధ్వర్యాన ఆయా ప్రాంతాల గిరిజన రైతులు ఆర్డీఓను కలిసి సమస్యను వివరించగా.. ఆర్డీఓ స్పందించి కలెక్టర్‌తో సంప్రదించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలగాని శ్రీనివాసరావు, కూరం మహేంద్ర, గీగా సురేష్, ఎడమ మహేష్, మహదేవ సర్వేశ్వరరావు, దుర్గా పాల్గొన్నారు.

కోదండరాంకు అభినందనలు..

తెలంగాణ ఉద్యమకారుడు, టీజేఏసీ చైర్మన్‌గా పని చేసిన ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా నామినేట్ చేయటంపట్ల గవర్నర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు, కోదండరాంకు అభినందనలు తెలిపారు.

మెడికల్ కళాశాలకు శరీర దానం



అగ్రిమెంట్ అందజేస్తున్న కర్నాటి కల్యాణి

మధిర: మధిర పట్టణానికి చెందిన కర్నాటి కల్యాణి (47) తన మరణానంతరం ఖమ్మం మమతా మెడికల్ కళాశాలకు శరీర దానం చేసేందుకు అగ్రిమెంట్ చేశారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో నివసిస్తున్న కర్నాటి వెంకటరెడ్డి, సుశీల దంపతుల కుమార్తె కల్యాణి గురువారం మమత మెడికల్ కళాశాలకు వెళ్లి తన మరణానంతరం శరీరాన్ని కళాశాలకు దానం చేయిస్తున్నట్లు సిబ్బందికి అగ్రిమెంట్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవించి ఉన్నప్పుడే కాకుండా చనిపోయిన తర్వాత కూడా సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో తన శరీరాన్ని దానం చేసేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ.. జీవితం చాలా చిన్నదని, సమాజానికి ఉపయోగపడే విధంగా కల్యాణి ఆలోచించడం అభినందనీయమని తెలిపారు. చనిపోయిన తర్వాత మన శరీరం నిరుపయోగంగా మట్టిలో కలిసిపోవడం కంటే వైద్య పరిశోధనలకు ఉపయోగపడటం భవిష్యత్ తరాలకు మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, డాక్టర్ కల్పన, అడ్వైజర్ తల్లపురెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులను అభినందిస్తున్న ఏసీపీ రామానుజం

సత్తుపల్లిటౌన్: ఆరోగ్యానికి, ఆత్మవిశ్వాసానికి, ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని సత్తుపల్లి ఏసీపీ బి.రామానుజం అన్నారు. జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మెడల్స్ సాధించిన ఉదయ్‌కుమార్, కిరణ్‌కుమార్, మన్విత్‌లను గురువారం ఆయన సర్టిఫికెట్లతో అభినందించారు. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జాతీయ స్థాయి కరాటే పోటీల నేషనల్ రిఫరీ పిచ్చయ్యను ప్రశంసించారు. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ ఉన్నారు.

ఈ కేవైసీ పూర్తిచేయాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ చందర్

బోనకల్: ఈ నెల 31వ తారీకులోపు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ పున్నం చందర్ సూచించారు. స్థానిక తహసీల్‌లో రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో రేషన్‌డీలర్లు లబ్ధిదారుల నుంచి ఈకేవైసీ పూర్తి చేసేలా చూసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా డిగ్రీ పూర్తి చేసిన వారందరూ పట్టభద్రుల ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు లక్ష్మణ్, శారద, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

27న చింతకానికి భట్టి

చింతకాని: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు చింతకానిలో ఈ నెల 27న పౌరసన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎంగా మల్లు భట్టివిక్రమార్క మొదటిసారిగా మండలంలోని నాగులవంచ, చినమండవ, కొదుమూరు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేసేందుకు విచ్చేస్తున్న సందర్భంగా పౌరసన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పూర్ణయ్య, చింతకాని సొసైటీ అధ్యక్షుడు కొండపల్లి శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపి, కిషోర్, గోవిందరావు, మనోహర్, అబ్దుల్ మజీద్, నేరడ గ్రామసర్పంచ్ ఈశ్వరమ్మ, పందిళ్లపల్లి ఎంపీటీసీ వీరభద్రం పాల్గొన్నారు.

27నుంచి ఉర్సు మహోత్సవం

వైరా: వైరాలోని యాకూబ్‌షా వలీ దర్గా ఉర్సు మహోత్సవం ఈ నెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ యాకూబ్ వలీ తెలిపారు. 27న గంధం సమర్పణ, 28న సాయంత్రం 8 గంటలకు కందల్ ఊరేగింపు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. గత 26 ఏళ్లుగా వైరాలో ఉర్సు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ ఉత్సవానికి హాజరవుతారని తెలిపారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరించాలి

వైరా: వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వైరాలోని గురుకుల పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిస్థితుల గురించి ప్రిన్సిపల్‌తో చర్చించారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు విన్నవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంకణాల అర్జునరావు, పూర్ణకంటి రామారావు, సంపసాల వరదరాజు, భూక్యా వెంకన్న, ఓర్సు శ్రీనివాసరావు, ఎలదండి బాబు, తదితరులు పాల్గొన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ఆలయాల అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో దాతలు యరమల శ్రీనివాసరెడ్డి, గురిజాల రామారావు, వాసిరెడ్డి వరుణ్‌రాజ్, గోపిశెట్టి శివరామకృష్ణ దంపతులు సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి

ఎర్రుపాలెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని స్థానిక సర్పంచ్ మూల్పూరి స్వప్న కోరారు. గురువారం మండలంలోని జమలాపురం గ్రామంలో వికసిత్ భారత సంకల్ప యాత్ర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, సెక్రటరీ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, సాయిస్ఫూర్తి సేవా సమితి, లయన్స్‌క్లబ్ సత్తుపల్లి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఖమ్మం, సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రులు, గంగారం పీహెచ్‌సీ బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో 90 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి డాక్టర్ మాట్టా సాత్విక్, సత్తుపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొడ్డా కృష్ణయ్య, కార్యదర్శి పెనుగొండ రమేష్, జోనల్ చైర్మన్ మందపాటి ప్రభాకర్‌రెడ్డి, కె.ప్రభాకర్‌రావు, సాంబశివగుప్తా, సత్యనారాయణ, సామంతరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, క్యాంప్ చైర్మన్ రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో రక్తదానం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, డైరెక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్, లైబ్రేరియన్ ఉపేందర్, రాచమళ్ల రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

గణతంత్ర సందడి..

సత్తుపల్లిటౌన్: గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిమగ్నమయ్యాయి. ఇందుకోసం ప్రత్యేకంగా జాతీయ జెండాలు, త్రివర్ణ టిషర్ట్‌లు, తోరణాలు, టోపీలు, వివిధ సైజుల జెండాలు, బ్యాడ్జీలు, బెలూన్స్ కొనుగోళ్లతో సత్తుపల్లిలోని దుకాణాలు సందడిగా మారాయి.

గ్రామీణ వైద్యులను గుర్తించాలి



మాట్లాడుతున్న పిట్టల నాగేశ్వరరావు

కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ వైద్యులను గుర్తించి, సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు అన్నారు. గురువారం కారేపల్లిక్రాస్ రోడ్డులో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రావంగా ఎన్నుకోగా.. అధ్యక్షుడిగా మండెపూడి వీరయ్య, గౌరవ అధ్యక్షుడిగా దాసరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా గణితి సైదులు, గుగులోత్ కృష్ణ, గుగులోత్ శివ, మండల ప్రధాన కార్యదర్శిగా ఆకారపు రఘు, మండల సహాయ కార్యదర్శిలుగా వెంకటేశ్వర్లు, షేక్ హైమద్ తదితరులు ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు బొప్పరి శంకర్, వెంకటాచారి, వెంకటరామయ్య పాల్గొన్నారు.

అల్పాహారానికి విరాళం

కల్లూరు: కల్లూరు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అల్పాహారానికి తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్‌కే సాధిక్ అలీ రూ.25 వేలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మకు గురువారం అందించారు. అదే విధంగా పది చదువుతున్న 42 మంది విద్యార్థులకు రూ.16 వేల విలువ చేసే ఆల్‌ఇన్‌వన్ గైడ్లు పంపిణీ చేశారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులకై మరో రూ.5 వేలు అందించారు. ఈ సందర్భంగా సాధిక్ అలీ మాట్లాడారు. పది పరీక్షల్లో 10/10 గ్రేడ్ సాధించినవారికి రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సాధిక్ అలీని సత్కరించారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: కారేపల్లి స్టేషన్ రోడ్‌కు చెందిన కరీం కుటుంబానికి ముస్లిం పెద్దలు రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఇటీవల కరీం అనారోగ్యంతో మృతి చెందటంతో.. ఆయన సతీమణి అన్నీతానై కుమారుడు, కుమార్తెను కూలీపనులు చేసుకుంటూ పోషిస్తుంది. కాగా.. కుమార్తె వివాహం సందర్భంగా ముస్లిం పెద్దలు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గౌసుద్దీన్, ఎండీ ఖలీలుల్లాఖాన్, షేక్ సద్దాం, హుస్సేన్, షేక్ మున్వర్, షేక్ ఫిరోజ్, అబ్దుల్ వాహేబ్, మోసి, రహీమ్, సలీం, ఇలియాజ్, సోను, తోసి, అజార్, ముస్తాఫా పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

సత్తుపల్లిరూరల్: రేజర్లలోని నిరుపేదలకు శ్రీవాణి బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పాలా ప్రవీణ్‌రెడ్డి తాతయ్య చెన్నారెడ్డి, తండ్రి నర్సింహారెడ్డిల జ్ఞాపకార్థం గురువారం రగ్గులను నవచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల ప్రభాకర్, గాదె నర్సింహారెడ్డి, టి.కిరణ్ పాల్గొన్నారు.

జోసఫ్ మృతి పార్టీకి తీరని లోటు

బోనకల్: కోటపర్తి జోసఫ్ మృతి పార్టీకి తీరని లోటని జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో గురువారం ఆయన సంతాప సభను నిర్వహించగా.. జోసఫ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట శ్రీను, నాగేశ్వరరావు, మల్లిఖార్జున్, కొండ, నాగరాజు, పుల్లారావు ఉన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరా: రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీవీఆర్‌కే ప్రసాదరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం నయాబజార్ పాఠశాల వేదికగా ఫిబ్రవరి 11, 12 తేదీల్లో మహాసభలు జరుగుతున్నాయని, ఈ సభలకు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, విద్యాశాఖ కార్యదిర్శ బుర్రా వెంకటేశం, విద్యాశాఖ సంచాలకురాలు దేవసేన తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ టీపీటీఎఫ్ బాధ్యులు మాధవరావు, రాంబాబు, నరసింహారావు, షఫి, నీలవేణి, పద్మ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, దొడ్డా వరప్రసాద్, కరకమ్మ, వెంకటేశ్వర్లు శ్రీదేవి పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువైంది..

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రజలు తమ హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని పలువురు వ్యక్తులు తెలిపారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను, నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతీ యువకులను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యతపై పాఠశాలలో సెమినార్, వ్యాసరచన, ముగ్గుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎర్రుపాలెం: ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు



కారేపల్లిలో..



బోనకల్: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



మధిర: వైఎస్సార్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ గణేష్



చింతకాని: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కొణిజర్లలో..



ముదిగొండ సెంటర్‌లో..



వైరాలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



సత్తుపల్లిటౌన్: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి



వేంసూరు: ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



కల్లూరులో..



తల్లాడ: బిల్లుపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మధిర: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..